తేనెపూత కత్తి

కప్పగంతుల వేంకటేశ్వర్లు

రాణాప్రతాపుడు భార్యాబిడ్డలతో చిత్తూరు విడిచివచ్చినపుడు, కూడావచ్చిన స్వామిభక్తులలో సమరసింహుడు అగ్రగణ్యుడు. సమరసింహుడి పూర్వులు కూడా చిత్తూరుసామ్రాజ్యానికి విశ్వాసపాత్రులైన సేవకులూ, రాజభక్తులూను-సమరసింహుడితాత శక్తిహుడు, బేబరు నెదిరించిన చిత్తూరురాణా సంగరాణాకు కుడిభుజము. సమరసింహుడితండ్రి, ఉదయసింహుడు పారిపోయినప్పుడు చిత్తూరుకోటను ప్రాణాలుపొయ్యేదాకా రక్షించి, దేశసేవకుడై వీరస్వర్గాన్ని అలంకరించాడు.

సమరసింహుడు రాణాప్రతాపుడికి నమ్మిన మిత్రుడు. వంశపారంపర్యంగా వస్తూవున్న రాజభక్తి సమరసింహుడిలో మూర్తీభవించింది. అందుచేతనే, అనేకమంది చిత్తూరుసేనానాయకులు మొగలులవద్ద లంచాలుతిని లోబడ్డా సమరసింహుడుమాత్రం తన భార్యతోటీ, పదిహేడేళ్లకొడుకు అజయుడితోటీ, రాణాతో అడవులకి వచ్చేశాడు. అడవుల్లో ఆకులలాలు తిని బ్రతుకుతూన్న వీళ్లను చిన్నచిన్న మొగలుసైన్యాలు వెదుకుతుంటూవస్తే, అక్బరుచక్రవర్తికి కబురేనా పోకుండా వుండేట్టుగా, రాణాకత్తి ఒరలోంచి బయటికి వచ్చే అవసరంలేకుండానే, కొద్దిపాటి రజపుత్ర సైన్యంతో వాళ్లను నరికిపారేశాడు, సమరసింహుడు. చిన్నచిన్న మొగల్ సేనాపతులకు సమరసింహుడంటే బెదురుగానేవుండేది.

అడివిలో రాణా విడిసిన స్థలాన్ని తెలుసుకొని మానసింహుడు, బిజిలీఖాను అనే సేనాపతిని రెండు వేల సైన్యాన్నిచ్చి, రాణామీదికి పంపించాడు. రాత్రివేళ కొండసట్టల చాటుగా పోయి, మొగల్‌సైన్యాలు రాణాని ముట్టడించాయి. అంతా కత్తులుతీసుకొని నిలబడ్డారు. రాణాకూడా తనకత్తిని తీశాడు. సమరసింహుడు, వొళ్లు తెలియకుండాపోట్లాడుతూవున్నాడు. ఎడమభుజం తెగి, నెత్తురు కాలవలుగా ప్రవహిస్తోంటే కూడా, పౌరుషం పెరిగిన ఆబోతెద్దులా పోట్లాడుతున్నాడు. అకస్మాత్తుగా వెనకనుంచి, తురక వొహడు వెన్నులోంచి కత్తిపచ్చాడు. సమరసింహుడు వెనక్కి తిరిగి, తన్ను పొడిచినవాడి తలకాయ తాటిముంజెలా కోశాడు. తరవాత పడిపొయ్యాడు.

తురకలు ఎత్తుకొనిపోతూన్న ఆడవాళ్ల కేకలు విని, రాణా పెద్దకొడుకు అమరసింహుడు వాళ్లని విడిపించడానికి పరుగెత్తాడు. రాణివాసస్త్రీలను రాణా స్వయంగా రక్షిస్తున్నాడు, భిల్లులసాయంతో.

సగంత్రోవలో అమరసింహుణ్ణి మొగలులు చుట్టేశారు. అతను ముందుకి పోవటానికి వీలు లేకపోయింది. ఆడవాళ్లని వాళ్లు ఎత్తుకొనిపొయ్యారు.

౨

బిజిలీఖాన్, సమరసింహుడిభార్య జమ్నాబాయిని, ఆరేళ్లక్రిందట యశ్వంతపూర్‌లో పుట్టింట చూశాడు. రాణాదగ్గిరకి, షాదుషా బక్షీరు తీసుకొనిపోయినప్పుడు, ఆమెరూపం చూసి ఆమెలా అందమైనవాళ్లు తమతురకల్లో దొరుకుతారేమోనని, అనేకమంది స్త్రీలని పరీక్షించాడు. కాని దొరకలే. నిద్రాహారాలుమాని వాకబుచేయగా, ఆమె చిత్తూరులో ఒక సేనానాయకుడిభార్య అని తేలింది.

చిత్తూరును అక్బరు ముట్టడించినప్పుడు- చిత్తూరు లోబడినతరువాత- అమితోత్సాహంతో, ఖాన్ ఆమెకోసం వెతికాడు. ఆమె కనపళ్లేదు. తురకలు పట్టుకున్న మిగతాఆడవాళ్లని పరీక్షచేశాడుకాని ఆమె వాళ్లల్లో లేదు. వాళ్లని ఆశపెట్టిఅడిగితే వాళ్లు రాణాతోపాటు, ఆమెభర్త భార్యాపిల్లలతో పారిపొయ్యాడని

చెప్పారు. ఖాన్ ఆలోచించాడు. మానసింహుడికి బోధ పరిచి, ప్రతాపుణ్ణి జయిస్తానని బొంకి, సైన్యంతో బయల్దేరి రాణాని ముట్టడించాడు. తనకు కావలసింది జమ్నాబాయి. ఆమె దొరకగానే, ఆమెను ఎత్తుకొని ఢిల్లీ వచ్చాడు. ఈవిషయం తెలిసిన సేవకులకి కొంచెం లంచం పెట్టి, అక్బరు కీసంగతి తెలీకుండా చేసు కున్నాడు.

నాలుగురోజులు గడిచాయి. అయిదోనాటిరాత్రి పరిచారకుల్ని పిలిచి 'ఆమె యెలావుంది'ని అడిగాడు. వాళ్లు, ఏడవటం తప్ప మరేమీ లేదనీ, అన్నంనీళ్లు కూడా మానేసిందనీ చెప్పారు. తన కావిషయం నాలుగురోజులనుంచీ చెప్పనందుకు వాళ్లని తిట్టాడు. స్వయంగా బయలుదేరాడు.

ఖరీదైనతివాసీలు పరిచినగదిలో పందిరిమంచం- మధ్యసోఫాలు- జల్లమీద అలంకారాలు- అన్నీ గజిబిజిగా పడిపోయివున్నాయి. ఒకమూల నేలమీద బోర్లాగా పడుకొని, కాళ్లువలుకట్టే కన్నీళ్లమడుగులో మొహంపెట్టివుంది జమ్నాబాయి.

రాజపుత్రస్త్రీలు మానరక్షణకోసం యేంతేనా చేస్తారన్న కథలు అనేకం విన్నాడు ఖాన్.

పరిచారికల్ని చూసి 'ఆమెను ఎత్తి మంచంమీద పడుకోబెట్ట'మన్నాడు ఖాన్.

స్పృహలేకుండా పడుకునివున్న ఆమెను యెత్తి వాళ్లు మంచంమీద పడుకోబెట్టారు.

మొలలో వడ్డాణం తీసెయ్యమన్నాడు. ఇంకా యేమేనా సాధనాలున్నాయేమో చూడమన్నాడు.

పక్కమీదనే, ఆమెప్రక్కని కూర్చుని కన్నీళ్లతో చెమ్మగిలిన ఆమెబుగ్గల్ని స్పృశించబోయ్యాడు. చేతులు వణికాయి. ఆమె స్వచ్ఛమైన రాజపుత్రస్త్రీ!

పరిచారికవచ్చి ఫాదుషావారిదగ్గర్నుంచి కబురొచ్చిందని చెప్పింది. నిట్టూర్పు విడిచి, విసుక్కుంటూ లేచివెళ్లాడు.

"ఫాదుషావారు కొలువులో వున్నారు. మిమ్మల్ని తొరగారమ్మన్నా"రని భటుడొకడు చేతులు కట్టుకొని చెప్పాడు. ఆత్రంతో, ఖాన్ వాడివెంట వెళ్లాడు.

ఢిల్లిసామ్రాజ్యపున్యాయస్థానంలో, న్యాయపీఠంమీద, న్యాయప్రభువని పేరుచెందిన, న్యాయమూర్తి అక్బరుచక్రవర్తి కూర్చున్నాడు. కొంతమంది రాజకీయోద్యోగులుకూడా వున్నారు. ఫాదుషాకళ్లు నిప్పుల్లా మెరుస్తోంటే, ఎదుటికి వెళ్లి సలాంపెట్టి నిలుచున్న ఖాన్ తత్తరపడ్డాడు.

"దుర్మార్గుడా! మొన్న రాణాప్రతాపుడిమీదికి యుద్ధానికి వెళ్ళినప్పుడు ఎత్తుకొని వచ్చిన ఆరాజపుత్రస్త్రీని ఎక్కడుంచావ్." అన్నాడు అక్బరు చాలా తీక్ష్ణంగా.

తడబడుతూ, "ప్రభువులు - చిత్తగించాలి - నేను ఏరాజపుత్రస్త్రీనీ -నేను-' అన్నాడు ఖాన్.

"చెప్పు. ఎక్కడుందామె ఇప్పుడు?"

"ఎ-వ-రు-జ-"

ఫాదుషా సింహాసనముమీదనుంచి లేచాడు. తక్కినవాళ్లుకూడా లేచారు.

"న్యాయముపేరట పాలింపబడే నారాజ్యంలో, నాఉద్యోగివైన నీవు, ఒకస్త్రీని దొంగతనంగా ఎత్తుకొనివచ్చి చెరబెట్టడమే కాకుండా, న్యాయస్థానంలో నా యెదుట అబద్ధంకూడా చెప్పావు. నీవాస్త్రీని తక్షణం-ఆమెతల్లిదండ్రులదగ్గరికి పంపుటకు - ప్రభుత్వానికి వప్పగించి మరణదండనకి సిద్ధంగావుండు-"

"స-ర్కా-ర్-నిజంగా నేనామెని-యింతవరకు-ముట్టుకోనుగూడ-లేదు."

ఫాదుషా వినిపించుకోకుండా వెళ్లిపోయాడు.

3

అక్బరుచక్రవర్తికొలువులో, తర్కశాస్త్రప్రవీణుడని పేరుచెందిన రామదీక్షితుడియింట్లో, ఆమె యిష్టంవచ్చినంతవరకూవుండి తరువాత తల్లిదండ్రులదగ్గరకి పోవటానికి, దీక్షితుడికోరికమీద జమ్నా వొప్పుకొంది. సంతానంలేనిదీక్షితుడికి జమ్నమీద పుత్రికా

వాత్సల్యం కుదిరింది. ఆమెకూడా ఆదంపతులికి విధేయురాలై వుంటోంది. అక్బరుచక్రవర్తికూడా దీక్షితుడి అసమానప్రేమకి సంతుష్టిచెందాడు.

*   *   *   *   *

'నౌరోజావుర్సు' పండుగలు, మొగలుచక్రవర్తుల కాలంలో (ముఖ్యంగా అక్బరుచక్రవర్తికాలంలో) చాలా వేడుకగా జరపబడేవి. కృష్ణదేవరాయలకాలంలో, దసరాపండగలకీ, అక్బరుచక్రవర్తికాలంలో నౌరోజావుర్సుకీ చాలాప్రాముఖ్యతవుండేది. దసరా, స్త్రీపురుషులనక, యిరుతెగలవారికీ సమానంగా ఉత్సాహకరమైంది. నౌరోజావుర్సు ఒక్క స్త్రీలకిమాత్రమే. ఆపండగరోజున పురుషుడనేవాడు బజార్లో అవుపడకూడదు. అంతా స్త్రీలే. అన్నిరకాలవస్తువులూ స్త్రీలే విక్రయించేవాళ్లు, స్త్రీలే కొనుక్కునేవాళ్లు.

ఆనాడు అందరిస్త్రీలకిమల్లేనే జమ్నకూడా ఉత్సవంలో పాల్గొంది. వింతైన వివిధవస్తుసముదాయాల్తో కూడిన ఆనవారి అంగళ్లని చూస్తూ బజార్లవెంట నడుస్తోంది.

ఒకఅంగడికూల, సాముద్రికం చెప్తూన్న ముసలిమహమ్మదీయవనిత జమ్నని పిలిచింది. జమ్న అక్కడికి వెళ్లింది. నిజాలుకొన్నీ, అబద్ధాలు కొన్నీ సాముద్రికం చెప్పి, "లోపల మా అక్క వుంది. వాకంటె ఆమె చాలాబాగా చెయ్యిచూస్తుంది; రండి" అని చెయ్యి పట్టుకొంది, ఆముసలిమహమ్మదీయవనిత. ఆచెయ్యి చెమటపట్టి చెమ్మగిలివుంది. జమ్నకి సందేహం కలిగింది. కాని 'చండశాసనుడైన అక్బరుచక్రవర్తికాలంలో స్త్రీలకు అవమానంజరుగుతుందా?' అనుకుంది. దురాత్ముడైన ఖానుచేతుల్లోంచి తప్పించిందిఅక్బరే కదూ! అదీకాక, స్త్రీలపండగలో అంతఃపురస్త్రీలుకూడా పాల్గొనేటప్పుడు, మొగవాడు మోసంతలపెడితే ఏమాత్రం అనుమానం కలిగినా ప్రాణంపోదూ వాడికి!!

సందేహిస్తూనే, ఆముసల్ది చూపించిన గదిలోకి పోయింది. పెద్దహాలు. లోపల గడియవేసింది ముసలమ్మ. ఇంకోతలుపు తియ్యగానే, ఎద్దులాంటి సిద్దీవాడు బయటికి వచ్చాడు. అరవబోయింది జమ్న. ముసల్ది నోటిమీద చెయ్యేసి, బరబరా రెండోగదిలోకి లాక్కుపోయింది. డెబ్బైయేళ్లువుండిన ఆముసలమ్మకి అంతబలం యెలావొచ్చిందో!

లోపల యిద్దరుపరిచారికలు వచ్చి, జమ్నని అరవకుండా బూరుగుపరుపువేసిన మంచంమీద పడుకోబెట్టి పట్టుకున్నారు.

మొహమ్మీదకళ్లవరకూకట్టుకున్న గుడ్డా, నెత్తిమీది ముసలిజుట్టు, కట్టుకున్న లుంగా—విప్పి పారవేసింది ముసలమ్మ— న్యాయసార్వభౌముడు అక్బరు ప్రత్యక్షం. పరిచారికలు వెళ్లిపోయ్యారు.

వికటపునవ్వు నవ్వుకుంటూ,— చక్రవర్తి గదితలుపుదగ్గరకి వచ్చి తలుపు తియ్యబోతూవుంటే, "అక్బర్"!—

వెనక్కితిరిగి చూశాడు. తను పీకిపారేసినగుడ్డలు మంచంక్రింద పడివున్నాయి. దిగంబర రూపంతో వున్న ఆమెగుండెల్లోంచీ, కంఠంలోంచీ, నెత్తురు కారుతూవుంటే, వికృతాకారంగా పడివుంది జమ్న. నిస్తబ్ధుడైనాడక్బరు.

తలుపు తీసి, బయటనుంచున్న పరిచారికల్ని చూసి 'పాముచుకొని చచ్చింది. జాగ్రత్త. బయటతెలిసిందంటే'—అన్నాడు అక్బరు. వాళ్లు ఆత్రంతో మంచందగ్గరికి పరుగెత్తారు

రెండోగుమ్మందగ్గర నిల్చున్న సిద్దీవాడిమీద చేతులేసి మళ్లీ ఆవికటపునవ్వే నవ్వాడు అక్బరు. జమ్న సంగతి యింకెవరికీ తెలీదు.

౪

రెండేళ్లు గడచినతరువాత, మానసింహుడు యుద్ధాన్ని ప్రకటిస్తూ, పాదుషా ఆజ్ఞమీద ప్రతాపుడికి వార్త పంపించాడు. ప్రస్తుతం రాణాస్థితి, యుద్ధాన్ని గాడుగడా, చిన్నకుటుంబకలహాన్ని తీర్చేట్టుగూడా లేదు. కూడుగుడ్డలు లేక, తను, తనఆలుబిడ్డలు –, అందరికన్న యెక్కువగా అజయుడు. ఎంతో శ్రమ

పడుతున్నారు. తనవంతు జొన్నరొట్టెల్ని రాణాసంతానానికి పంచిపెట్టి, భిల్లులతోపాటు తనూ ఆకూ అలమూ తిని తృప్తిపడేవాడు అజయుడు. ఎన్నోసార్లు రాణా, రాణీ, యిద్దరూ మందలించారు, అలా చెయ్యొద్దని. కాని వారి యెరిక లేకుండానే, రాజసంతానానికి తనరొట్టెల నర్పించి ధన్యుణ్ణనుకునేవాడు అజయుడు. తల్లిదండ్రులు లేని అజయుణ్ణి రాణాకుటుంబము, వాళ్ల సంతానముకంటే యెక్కువ ప్రేమతో పెంచుతున్నారు. రాణావారిచిన్నబిడ్డలు సగర్, తారాబాయిలకి అజయుడంటే అమితమయిన చనవు. అజయుడెప్పుడూ వాళ్లని సంతోషపరచడానికే ప్రయత్నిస్తుండేవాడు.

ఇలాంటిస్థితిలో యుద్ధాన్ని ప్రకటిస్తో మానసింహుడు వ్రాసినలేఖ రాణాని కొంత కలవరపెట్టింది. ఎన్నివిధాల ఆలోచించినా, మొగలుసైన్యాల్ని ఎదిరించడంగాని, వాళ్లు వస్తే స్వసంరక్షణగాని చేసే స్థితిలో లేడు.

తానెప్పుడూ ఓడిపోవడానికి ఒప్పుకోననీ, అరణ్యాల్లో కూడుగుడ్డలులేక యిబ్బందిపడుతూన్నా, తనే చిత్తూరురాజ్యానికి రాణాననీ, స్వరాజ్య సంపాదనకోసం ప్రాణాల్ని అర్పించడానికి తానెప్పుడూ సిద్ధుణ్ణేననీ, కాని పరిస్థితులు సరిగా లేకపోవటంవల్ల, వాళ్లయుద్ధాన్ని కొంతవరకు ఆపుచేయవలసిందనీ, తాను తిరిగి సమర్థత సంపాదించినప్పుడూ, తనను మాతృభూమి ఆహ్వానించినప్పుడూ వాళ్లకంటేముందు తనే యుద్ధాన్ని కోర్తాననీ — ఒకవుత్తరం వ్రాసి అక్బరుకు పంపదలచుకొని — వ్రాశాడు.

తనభిల్లసైనికుల్లో ఒకణ్ణి ఆ వుత్తరంతో పంపుదామనుకుంటూవుండగా, అజయుడు తను పోతానన్నాడు.

“మీ అమ్మనికూడా అప్పుడు మొగల్ సైనికులే యెత్తుకొనిపొయ్యారు. అదృష్టవంతుడవైతే నీతల్లిని మళ్లీ చూస్తావు. భగవంతుడు నిన్ను అనుగ్రహించాలి.’ అని మేవారురాణి ఆదరణపురస్కారంగా దీవించింది.

అమ్మమాట వినేటప్పటికి అజయుడికళ్లు చెమర్చాయి. చిరిగిన ఉత్తరీయంతో రాణా కన్నీళ్లు తుడిచాడు. కొండక్రింద లోయదాకా, పదిమంది భిల్లులతో అమరసింహుడు అజయుణ్ణి సాగనంపాడు.

౫

నిండుసభలో మొల్లా చదివినవుత్తరాన్ని, యితరసభికులతోపాటు, వాళ్లకంటే ఎక్కువసంతోషంతోటే, దర్పంతోటే, భుజాలు ఎగరవేసుకుంటూ అక్బరు విన్నాడు. అంతా చదవడం అయాక, మీసం మెలివేస్తూ సభంతా కలయచూశాడు. అంతా తలోమాటా అన్నారు.

“సరే! మదగజం మెల్లిమెల్లిగా లొంగుబాటుకొస్తోంది. రాకేంచేస్తుంది? ” అని ఆ విషపునవ్వే మళ్లీ నవ్వాడు. ఉత్తరం తెచ్చిన యువకుణ్ణి తేరి పారచూసి యేదో మరిచిపోయిన విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకోంటోన్నాడు అక్బరు.

వంగి సలాంచేసి, మంత్రిపంపిన సేవకుడితో వెళ్లిపోయాడు అజయుడు.

తరువాతకూడా చాలాసేపు ఆలోచించాడు అక్బరు. కాని, తాను ఎవర్ని చెరపెట్టి, ఆ మెమరణానికి కారకుడైనాడో ఆ జమ్నాబాయికొడుకే అజయుడని స్ఫురణకి రాలేదు.

* * * *

పదిరోజులు గడిచాయి. ఢిల్లీనగరమూమధ్యవున్న పెద్ద ఉద్యానవనంలో చక్కటి పచ్చికమీద కూర్చొని, ఆలోచిస్తున్నాడు, తల్లినిగురించి, అజయుడు. చీకటి పడుతూంది. అక్కడక్కడతప్ప అంతగా జనసంచారం లేదు. ముసుగువేసుకున్న ఒకవ్యక్తి ఎదురుగా వచ్చి నిలబడింది.

“ఎవరు మీరు ? ” అన్నాడు అజయుడు. ఆ వ్యక్తి అతనిచెయ్యిపట్టుకొని, తోటలో మారుమూలవున్న గుబురు మల్లెపందిరిక్రిందకి లాక్కుపోయింది. ముసుగు తీసింది. సన్నటివెన్నెట్లో, అందమైన స్త్రీరూపం, స్పష్టంగా చూశాడు అజయుడు.

రెండడుగులు వెనక్కి జరిగాడు. ఆస్త్రీ రెండడుగులు అతనివేపు జరిగింది.

‘ఎవరు మీరు, ఏంకావాలి?’

“రాణా ప్రతాపసింహుని దగ్గర్నుంచి వొచ్చింది మీరేనా?”

“అవును. మీ కేంకావాలి?”

“మీ పేరు— అజయుడు?”

“అవును. మీ కేంకావాలి?”

“జమ్నాబాయి. మీ—”

“అమ్మ. ఆవిడ యెక్కడుందో మీ రెరుగుదురా? నా కామెని చూపుతారా?”

“నాతరంకాదు— నే నొకసంగతి మీకు చెప్పాలని యిక్కడికి తీసుకొచ్చాను.”

“చెప్పండి. ఆమె యెక్కడున్నారు?”

“ఆమె చనిపొయ్యారు. ఘోరంగా— ఆత్మహత్య!!’

“ఆఁ. నిజమే!!”

అవునని తలవూపింది. వెక్కి వెక్కి యేడుస్తూ వున్న అజయుణ్ణి తనమీదకి లాక్కుని ఓదార్చింది.

“ఓదారండి— ఆమెని—” అంటూ, యిటూ అటూ బాగాపరికించి, కంఠం తగ్గించి, ఇలాచెప్పింది ఆవిడ. “ఆమెని— అక్బర్ చక్రవర్తి మానభంగంచేసి చెరిచాడు— ఆమె సహించలేక ఆత్మహత్య చేసుకుంది. ఆదృశ్యం కళ్లారా చూశాము. నేనూ— మా బంధువే మరోహామే— మరోహసిద్దీ—. తక్కిన వాళ్లిద్దర్నీ చక్రవర్తే రహస్యం బయలుపడుతుందని చంపించేశాడు. నన్నూ యెప్పుడో—”

ఆమె వోహస్త్రీఅనీ, ఆమెమీద తను పడి కౌగలించుకొని యేడుస్తున్నాననీ, అజయుడు మరిచిపొయ్యాడు. ఆమె అతణ్ణి తనుకూడా కన్నీళ్లుతుడ్చుకుంటూ ఓదారుస్తోంది.

“నువ్వెవరు?”

ఉడికిపోతున్న అతనిగుండె రక్తాన్నుంచి వస్తూ వున్న ఆవిరి బాగా కనిపెట్టింది ఆమె.

“ప్రస్తుతం అక్బరుచక్రవర్తి జనానాలో పరిచారికను నేను ముఖ్యంగా సిగ్గువిడిచి మిమ్మల్ని కోరేది —మీహృదయంలో నా కొకస్థానం కావాలనే—”

అతను కూర్చుని, ఆమెని దగ్గిరకి లాక్కుని కౌగిలించుకున్నాడు. ముద్దు పెట్టుకున్నాడు.

౬

నెలరోజులు గడవవొచ్చాయి. అక్బరుదగ్గిర ఆజ్ఞతీసుకొని తిరిగి రాణాదగ్గిరకి పోవడానికి అజయుడు నిశ్చయించుకున్నాడు. ఈలోగా, తన తల్లినిగురించిన రహస్యం తనకి చెప్పినదాసీకీ, అతనికీ అన్యోన్యంగా అసమానమైనప్రేమ కుదిరింది. ఆమెకూడా అతనితో రహస్యంగా వొస్తానని వొప్పించింది.

అక్బరుతో తనసంగతి చెప్పుకుందుకి అజయుడు వెళ్లాడు. అక్బరు మొహంచూడగానే వొళ్లు కుతకుత ఉడకడం ప్రారంభించి.ది. అణిచిపెట్టుకున్నాడు.

“ఉద్యానవనంలో మాట్లాడుదాం. రా.” అని అక్బరు అన్నాడు.

ఇద్దరూ పాదుషా ఉద్యానవనంలో మాట్లాడుకొంటూ పచారుచేస్తున్నారు. కొంచెందూరంలో, అంతఃపురంలోకి వచ్చేపొయ్యే పరిచారికాజనం కనపడుతూవున్నారు. ఒంటరిగావుంటే, ఇలాంటి అక్బర్లని నలుగుర్ని పేరులేకుండా చేదామనుకున్నాడు అజయుడు. గోలగా కేకలేస్తోన్న ఒకస్త్రీని ఆరుగురు తురకలు పాదుషాదగ్గిరకి పట్టుకొని వచ్చారు. ఆ స్త్రీని గుర్తించగానే, కెవ్వునఅరిచి, కత్తిదూసి పాదుషామీద పడ్డాడు అజయుడు. పాదుషా ఎడంచెయ్యిమీద గాయం తగిలింది.

రక్తపుమడుగుల్లో సగం తెగి, పొర్లుతోన్న అజయుడిమొహమ్మీద చడావుకాల్తో జాడించితన్నాడు అక్బరు. వుమ్మికూడా వేశాడు.